ప్రజాశక్తి
మంగళవారం 20 మే, 2025
5
శ్రీకాకుళం

1న ఉచిత మోడల్ లాసెట్

శ్రీకాకుళం: జూన్ 1న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆంధ్రప్రదేశ్ బిసి న్యాయవాదుల సంఘం ఆధ్వర్యాన శ్రీకాకుళం నగరంలోని ఎంపిఆర్ లా కాలేజీలో ఉచిత మోడల్ లాసెట్ నిర్వహించనున్నట్లు ఎపి బిసి న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆగూరు ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు తెలిపారు. ఎంపిఆర్ లా కాలేజీలో ప్రిన్సిపాల్ కె.మోషేతో కలిసి సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఉచిత మోడల్ లాసెట్‌కు ఎటువంటి రుసుం చెల్లించనవసరం లేదన్నారు. ఐదేళ్లు, మూడేళ్ల లా కోర్సుల కోసం దరఖాస్తు చేసిన వారు ఈ ఉచిత మోడల్ లాసెట్ రాయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో బిసి న్యాయవాదుల సంఘం సీనియర్ సభ్యులు కూన కసవయయ పాల్గొన్నారు. మోడల్ లాసెట్ జనరల్ నాలెడ్జ్, నూతన న్యాయ చట్టాలు, లీగల్ అంశాలపై ఉంటుందని తెలిపారు. వివరాలకు లక్ష్మణరావు సెల్ నంబరు 9640780728ను సంప్రదించాలన్నారు.

నాగావళి వరద ఉధృతికి కలివరంలో కుంగిన ఆర్‌బికె భవనం (ఫైల్)

కర'కట్ట'రా?

జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు కొంత ప్రాధాన్యమిస్తున్నా కరకట్టల నిర్మాణాల విషయంలో మాత్రం పాలకులు చాలా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం కరకట్టల అంచనాలను పెంచిందే తప్ప ఒక్క అంగుళం మేర కూడా పని చేపట్టలేదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం కరకట్టల నిర్మాణ వ్యయం ఎక్కువగా ఉండటంతో 2019లో పనుల కాంట్రాక్టు ఒప్పందాలను రద్దు చేసింది. వాటి స్థానంలో అత్యంత ప్రమాదకరమైన ప్రాంతాల్లో వరద గట్ల నిర్మించాలని నిర్ణయించింది. అధికారులు ప్రభుత్వానికి పలుమార్లు ప్రతిపాదనలు పంపినా వాటినీ ఆమోదించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్నా ఆమోదం తెలపపోవడంతో ప్రతిపాదనలు కార్యరూపం దాల్చడం లేదు.

- అడుగు ముందుకు పడని కరకట్టల పనులు
- ముంపు తీవ్రత ప్రాంతాలతో గతంలో పలుమార్లు ప్రతిపాదనలు
- ఐదేళ్లుగా వైసిపి ప్రభుత్వ నాన్చివేత ధోరణి
- ఏడాది కాలంగా కూటమి సర్కారుదీ అదే తీరు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార, నాగావళి నదుల వరదల నుంచి నదీ తీర గ్రామాల రక్షణకు గతంలో కరకట్టల పనులను ప్రారంభించినా ఫలితం లేకపోయింది. 2009-10 మధ్య కాలం వరకు కాస్తాకూస్తో పనులు జరిగినా ఆ తర్వాత నుంచి ఒక్క అడుగు ముందుకు పడటం లేదు. కరకట్టల నిర్మాణానికి పెద్ద ఎత్తున భూమిని సేకరించాల్సి ఉండటం, భూసేకరణకు అధికంగా నిధులు వెచ్చించాల్సి రావడంతో ప్రభుత్వం 2019లో ఉన్నపళంగా కరకట్టలను రద్దు చేసింది. వరద ముప్పు తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించాలంటూ అధికారులను ఆదేశించింది. జిల్లాలో ఆ విధంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అధికారులు 2020 ఫిబ్రవరిలోనే ప్రతిపాదనలు పంపారు. ముంపు తీవ్రత అధికంగా ప్రాంతాలను గుర్తించి అందులో ముఖ్యమైన పనులకు ప్రాధాన్యమివ్వాలన్న ప్రభుత్వ ఆదేశాలతో నాగావళి కరకట్టలకు సంబంధించి అధికారులు తొలుత ఐదు ప్రాంతాలను గుర్తించారు. నాగావళి నది పరివాహక ప్రాంతమైన ఆమదాలవలస మండలం తొగరాం వద్ద రూ.13.14 కోట్లతో, గండ్రేడు వద్ద రూ.8.82 కోట్లతో, బెలమాం వద్ద రూ.1.83 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. బూర్జ మండలం అల్లెన నుంచి బూర్జ పాత కరకట్ట వరకు వరద గట్టు కోసం రూ.13.86 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. మొత్తం రూ.37.65 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అదేవిధంగా వంశధార నదీ పరివాహక ప్రాంతంలో 22.77 కి.మీ మేర కరకట్టలను నిర్మించేందుకు రూ.77.60 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. నాలుగేళ్ల కాలంలో రెండు, మూడు పర్యాయాలు అధికారులు ప్రతిపాదనలు పంపుతున్నా కొర్రీలు వేసి వెనక్కి పంపింది.

వంశధార కరకట్టలకు కొత్త ప్రతిపాదనలు

వంశధార కరకట్టలకు సంబంధించి తీవ్ర కోతకు గురయ్యే ప్రాంతాలతో పాటు నాలుగు ప్యాకేజీ పనులకు కొత్త ప్రతిపాదనలను ఈ ఏడాది జనవరిలో అధికారులు పంపారు. ప్యాకేజీ-1 నిర్మాణ పనుల కోసం రూ.590 కోట్లు కావాలని ప్రతిపాదించారు. ప్యాకేజీ -2 కోసం రూ.348 కోట్లు, ప్యాకేజీ -3 కోసం రూ.500 కోట్లు అవసరం పడతాయని నివేదికలు పంపారు. అదేవిధంగా ప్యాకేజీ-4కు సంబంధించి పనుల కోసం రూ.244 కోట్లు కావాలని ప్రతిపాదనలు పంపారు.

కరకట్టల పనుల పరిస్థితి ఇలా..

వంశధార నదిపై నిర్మించాల్సిన కరకట్టలను నాలుగు ప్యాకేజీలుగా విభజించారు. మొదటి ప్యాకేజీ పనులు 2007లో ప్రారంభించారు. ఇప్పటివరకు 7.55 శాతం పనులే పూర్తయ్యాయి. 2007లోనే మొదలైన ప్యాకేజీ-2 పనులు 5.66 శాతం మాత్రమే జరిగాయి. ప్యాకేజీ-3 పనులను కూడా 2007లో ప్రారంభించారు. 2.45 శాతం పనులు పూర్తి చేశారు. 2009లో ప్రారంభమైన ప్యాకేజీ-4 పనులు 21.32 శాతం మాత్రమే జరిగాయి. నాగావళి నదిపై నిర్మిస్తున్న కరకట్టల పరిస్థితి కూడా అలానే ఉంది. శ్రీకాకుళం జిల్లాలో నిర్మిస్తున్న కరకట్టలను నాగావళి-2 ప్యాకేజీ పనులుగా చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన గాయత్రి ప్రాజెక్ట్సు సంస్థకు రూ.61.45 కోట్లకు పనులను అప్పగించారు. 2008లోనే పనులను ప్రారంభించింది. ఇప్పటికీ పనుల్లో పెద్దగా పురోగతి కనిపించడం లేదు. జిల్లా పరిధిలో 51.88 కి.మీ మేర వరద కట్ట నిర్మించాల్సి ఉండగా, ఇప్పటివరకు 17.29 కి.మీ పొడవు మేర మాత్రమే పని పూర్తయింది. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 25 శాతం కంటే తక్కువ ఖర్చు చేసిన పనులను తాత్కాలికంగా నిలిపివేయాలంటూ వాటిని మే 29, 2019న ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అధికారులు ఎక్కడి పనులను అక్కడే నిలిపేశారు.

కొత్త ప్రతిపాదనలతో అంచనాలు సిద్ధం చేస్తున్నాం

నాగావళి కరకట్టలపై గత ప్రభుత్వ హయాంలో రెండు, మూడు పర్యాయాలు ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం వద్ద ఫైల్ పెండింగ్‌లో ఉంది. ప్రభుత్వం అడిగితే కొత్త అంచనాలతో మరోసారి పంపిస్తాం.

\- పి.సుధాకరరావు, నీటిపారుదల శాఖ ఇఇ

కరకట్టలపై డేటా పంపాం

వంశధార కరకట్టలపై ఉన్నతాధికారుల సూచనల మేరకు ఎప్పటికప్పుడు ప్రతిపాదనలు పంపుతూనే ఉన్నాం. వంశధార కరకట్టలకు సంబంధించి నాలుగు ప్యాకేజీ పనులకు అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం ఆమోదిస్తే పనులు ప్రారంభిస్తాం.

\- కె.వెంకటేశ్వర్లు, ప్రత్యేక పరిశోధన విభాగం ఇఇ

సుందరయ్య ఆశయ సాధనకు కృషి

శ్రీకాకుళం : విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న సిపిఎం నాయకులు

వజ్రపుకొత్తూరు : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

స్వతంత్ర సమరయోధుడు దక్షిణ భారత దేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత తొలి పార్లమెంట్ ప్రతిపక్ష నేత పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శి వర్గసభ్యులు ఎం.కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. సోమవారం సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా శాంతినగర్‌లోని స్వతంత్ర సమరయోధుల స్మృతి వనంలో ఆయన విగ్రహానికి పూలమాల వేశారు. అదేవిధంగా సిపిఎం కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ సుందరయ్య తన యావత్ జీవితాన్ని ప్రజా పోరాటాలకు అంకితం చేసిన మహాయోధుడని కొనియాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయడమే ఆయనకు మనమిచ్చిన ఘన నివాళి అని అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం దేశ సంపదను, ప్రజల ఆస్తులను, ప్రకృతి వనరులను కార్పొరేట్ ఆస్తిగా మార్చేస్తుందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అల్లు సత్యనారాయణ, ఆర్.ప్రకాశరావు, ఎం.వి.కామేశ్వరరావు ఎం.ప్రభాకరరావు, కొత్తకోట అప్పారావు, సత్తార్ భాస్కరరావు, అల్లు సోమశేఖర్, ఎ.లక్ష్మి, ఎల్.మహేష్, కె.సూరయ్య, ఎం.గోవర్ధన్, ప్రవీణ్, పి.సుధాకర్ పాల్గొన్నారు. చింతాడ రామచంద్రరావు సుందరయ్యపైన నివాళ్లర్పిస్తూ గీతాలాపం చేశారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని బెండిలో ఎపి రైతు సంఘం మండల కార్యదర్శి కె.బాలజీ అధ్యక్షతన సుందరయ్య చిత్రపటానికి ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కోనారి మోహనరావు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంశధార ఎడమ కాలువ ద్వారా పలాస, వజ్రపుకొత్తూరు శివారు భూములకు సాగునీరు అందించడానికి పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. ఆఫ్‌షోర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి 17 ఏళ్లు కావస్తున్న 40 శాతం పనులు కూడా పూర్తి కాలేదని విమర్శించారు. కార్యక్రమంలో ప్రజా కళాకారులు కె.హేమసుదన్, హరికృష్ణ, ఎపి రైతు సంఘం మండల అధ్యక్షులు కె.వెంకటరావు, నీలాచలం, తిరుమలరావు, లక్ష్మి, ముత్యాలమ్మ, సరస్వతి, నీలవేణి పాల్గొన్నారు.

అలాగే నగరంపల్లిలో సుందరయ్య చిత్రపటానికి సిపిఎం నాయకులు ఎన్.మోహనరావు, బి.ఆనందరావు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన పాటలు ఆలోచింపజేశాయి. కార్యక్రమంలో టి.భాస్కరరావు, బి.రామకృష్ణ, ఎన్.సింహాచలం, ఎన్.ఈశ్వరమ్మ, బి.సుగుణావతి, బి.లక్ష్మి, టి.లక్ష్మి, ఎస్.సరోజనమ్మ, మల్లేష, సుధాకర్, యశోదమ్మ పాల్గొన్నారు.

ఎచ్చెర్లలో...

రణస్థలంలో...

ఎచ్చెర్ల : మండలంలోని అరిణామక్కివలస వద్ద గల ఎన్ఎసిఎల్ ఇండస్ట్రీస్ పరిశ్రమ వద్ద సుందరయ్య చిత్రపటానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో నాగార్జున అగ్రికం స్టాఫ్, వర్కర్స్ యూనియన్స్ నాయకులు లింగాల రామప్పడు, మాన్యం రమణ, అంబటి సత్యనారాయణ, టి.రవికుమార్, ఎల్.వరదరాజు, చిక్కాల సత్యనారాయణ, ఎస్.పరశురాం పాల్గొన్నారు.

రణస్థలం: మండలంలోని వరిశాం వద్ద ఉన్న శ్యాంపిస్టన్స్ పరిశ్రమ వద్ద సుందరయ్య చిత్రపటానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో వెంపడాపు లక్ష్మణరావు, మహేష్, ఎమ్.రమణ, వి.మధు, సూరప్పన్న పాల్గొన్నారు.

పలాస : కాశీబుగ్గ సిపిఎం కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి సిపిఎం నాయకులు ఎన్.గణపతి, తెప్పల అజయ్ కుమార్ పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ప్రజాశక్తి పలాస డిఒ ఉమామహేశ్వరరావు, ఢిల్లీశ్వరి, తెప్పల సత్యవతి, కె.సుహాసిని పాల్గొన్నారు.

కొత్తూరు : కొత్తూరులోని సుందరయ్య చిత్రపటానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్ పూలమాలలు వేశారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.అప్పన్న, పి.కృష్ణ, ఎస్.సింహాచలం, ముఖలింగం, రమేష్ పాల్గొన్నారు.

అలాగే మండలంలో మెట్టూరు బిట్టు -3 ఇరపాడులో ఉన్న హరీష్ అనురాగ నిలయం (వృద్ధాశ్రమం)లో సుందరయ్య చిత్రపటానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం, జిల్లా ఉపాధ్యక్షులు జి.ఈశ్వరమ్మలు పూలమాలలు వేశారు. అనంతరం వృద్ధులకు, చిన్నారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

టెక్కలి రూరల్ : స్థానిక సిఐటియు కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి సిపిఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో బగాది వాసుదేవరావు, హనుమంతు ఈశ్వరరావు, ఉర్జాన లక్ష్మణరావు, పాలవలస ధర్మారావు, ఇప్పిలి మల్లేశ్వరరావు, వాకాడ ధనుంజయరావు, సుబ్రమణ్యం, ప్రసాద్, సరస్వతి, భాస్కరరావు పాల్గొన్నారు.

'ప్రజాశక్తి' కార్యాలయంలో...

కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శనీయమని ప్రజాశక్తి ఎడిషన్ మేనేజర్ పి.కామినాయుడు అన్నారు. ఎచ్చెర్ల మండలం కుశాలపురం ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లోని ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎడివిటి ఇన్‌ఛార్జి టి.బుజ్జిబాబు అధ్యక్ష వహించిన కార్యక్రమంలో సమన్వయ కమిటీ సభ్యులు ఎ.సోమశేఖరరావు, టి భీమారావు, సిబ్బంది పాల్గొన్నారు.

కుప్పిలి ఉపాధ్యాయులపై ఛార్జెస్‌ను ఉపసంహరించుకోవాలి

- విన్నవించిన ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక
- 'మీకోసం'కు 75 వినతులు

వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లాలోని ఎచ్చెర్ల మండలం కుప్పిలి మోడల్ స్కూల్‌లో పది పరీక్షల నిర్వహణపై డిఇఒ ఉద్దేశపూర్వకంగా మాస్ కాపీయింగ్ పేరుతో 14 మంది ఉపాధ్యాయులపై సస్పెన్షన్, క్రిమినల్ కేసులు నమోదు చేయడం అభ్యంతరకరమని, ఈ వ్యవహారంలో విచారణ నివేదికల ఆధారంగా డిఇఒపై క్రమశిక్షణా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ప్రతినిధులు కోరారు. నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లు సోమవారం వినతులను స్వీకరించారు. ప్రధానంగా ఈ వ్యవహారంలో పూర్తి బాధ్యత డిఇఒపైనే ఉందన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విచారణలో వాస్తవాలు బయటపడ్డాయని గుర్తు చేశారు. ఇప్పటికే 13 మందిపై సస్పెన్షన్లు ఎత్తి వేశారని, మిగిలిన వారిపై ఉన్న సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరారు. అలాగే ఉపాధ్యాయులపై ఉన్న ఛార్జెస్‌ను ఉపసంహరించుకోవాలని కోరారు. బుడగట్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు కనకరాజుపై సస్పెన్షన్ను ఎత్తివేయాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు తంగి మురళీమోహనరావు, మజ్జి మదన్‌మోహన్, ఎస్.కిషోర్‌కుమార్, వి.సత్యనారాయణ, బి.శ్రీరామ్మూర్తి, జి.రమణ, పి.కృష్ణారావు, బి.రవి, తదితరులు పాల్గొన్నారు. అలాగే నరసన్నపట గాంధీనగర్-4లో నివాస ఉంటున్న వైశ్యరాజు రామరాజు సర్వే నంబరు 36 బొడ్డవలసలో కేటాయించిన రిజర్వు స్థలంలో పార్కు నిర్మించాలని, ఆ స్థలంలో ఓ స్వచ్ఛంద సంస్థ పేరుతో చేపట్టిన ఆక్రమణలను తొలగించాలని భారతితో పాటు పలువురు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 75 వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ పద్మావతి, డిఆర్ఒ ఎం.వెంకటేశ్వరరావు, జెడ్‌పి సిఇఒ ఎల్.ఎన్.వి.శ్రీధర్‌రాజ, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

ఈ నెల 5 నుంచి 15 వరకు బీహార్‌లో నిర్వహించి 7వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో జిల్లాకి చెందిన గుజ్జల వర్షిత వెయిటలిఫ్టింగ్‌లో బంగారు, ఎస్.రామ్మోహన్ కబడ్డీలో రజిత పతకాలు సాధించారు. వీరికి కలెక్టర్, జెసి అభినందించారు.

పిడుగుపాటుకు ప్రాణనష్టం ఉండరాదు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కలెక్టర్, స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

భారత వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జెసి జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌తో కలిసి జిల్లా అధికారులతో సోమవారం మాట్లాడుతూ పిడుగు పాటుకు సంబంధించి వాతావరణశాఖ నుంచి సమాచారం అందిన వెంటనే గ్రామ స్థాయిలో చేరే విధంగా వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసుకొని తద్వారా జిల్లా అధికారులు తెలుసుకోవాలన్నారు. వ్యవసాయ, పశుసంపద, తోటలు, చెట్లు పడిపోవడం, విద్యుత్ లైన్లు దెబ్బ తినడం వంటి సమాచారంపై సంబంధిత జిల్లా అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా వ్యవసాయ, పశు సంవర్ధక మత్స్య, ఉద్యానవన, విద్యుత్, రహదారులు, భవనాల శాఖల అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి వాతావరణ హెచ్చరికలు వచ్చిన వెంటనే సంబంధిత గ్రామాల్లో దండోరా, ప్రార్థనా స్థలాల్లో అందుబాటులో ఉన్న లౌడ్ స్పీకర్ల ద్వారా ప్రచారం చేయాలన్నారు. గత కొద్ది రోజుల్లో పశువులు, మనుషులు పిడుగు పాటుకు గురయ్యారని, అలాంటివి పునరావృత్తం కాకుండా చూడాలని అన్నారు. పిజిఆర్ఎస్ ప్రారంభానికి ముందు జిల్లా అధికారులతో పెండింగ్‌లో పిజిఆర్ఎస్‌పై అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజ పాల్గొన్నారు.

వివరిస్తున్న ఈడిజెడ్‌వన్ సంస్థ ప్రతినిధి

వర్చువల్ ల్యాబ్‌కు గ్రీన్‌సిగ్నల్

శ్రీకాకుళం : ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక విద్యకు నాంది పలకేలా 'జీరోసైన్స్ ల్యాబ్' వర్చువల్ ప్రయోగశాలను ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. మొదటిగా స్మార్ట్ డిస్‌ప్లేలు ఉన్న ఐదు పాఠశాలల్లో ఈ ల్యాబ్‌ను ప్రారంభించి, విద్యార్థులపై ప్రభావాన్ని విశ్లేషించనున్నామని అన్నారు. ఈ ప్రాజెక్టు కార్యాచరణపై కలెక్టర్‌ను సోమవారం కలిసిన ఈడిజెడ్‌వన్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు రామ్‌కుమార్ రామదేవు, సంతోష్ కొత్తకోట ప్రాజెక్టు వివరాలను తెలియజేశారు. వారిని కలెక్టర్‌కు పరిచయం చేసిన శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ ఇది జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఒక వినూత్న అవకాశమవుతుందని అన్నారు. టెక్నాలజీతో గ్రామీణ విద్యార్థులు సులభంగా పరిచయం కావడానికి ఇదొక మంచి దారిని అభిప్రాయపడ్డారు. విద్యను ప్రయోగాత్మకంగా, ఆసక్తికరంగా బోధించేందుకు ఈ వర్చువల్ ల్యాబ్ ఎంతో ఉపయుక్తమని, విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించగలదని అన్నారు. కలెక్టర్ ఈ ప్రతిపాదనపై సానుకూలంగా స్పందిస్తూ, పైలట్ ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులు, సాంకేతిక మద్దతు కల్పించేందుకు సమగ్ర చర్యలు తీసుకోవాలని సర్వశిక్షా అభియాన్ ఎపిసి శశిభూషణ్‌కు సూచించారు.

యాజమాన్య పద్ధతుల్లో వ్యాధుల నివారణ

పెద్దపేట ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్

రాజశేఖర్, డాక్టర్

ప్రజాశక్తి- కవిటి

ఉద్దానం ఉద్యానవన పంటలను అతలాకుతం చేస్తున్న తెల్లదోమ, గ్యానో డెర్మ, కొమ్ము పురుగు, నల్లముట్టు పురుగు, నల్లమచ్చ తెగులు వంటి తెగుళ్లు, పురుగుల నివారణకు రైతులందరూ సామూహికంగా, సమగ్రంగా సస్య రక్షణ చర్యలు తీసుకుంటే వాటి వ్యాప్తిని చాలా వరకూ నియంత్రించవచ్చని పెద్దపేట ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు ప్రజాశక్తితో మాట్లాడిన ఆయన వీటి నివారణకు తీసుకోవాల్సిన, చేపట్టాల్సిన జీవ నియంత్రణ పద్ధతులు తెలియజేశారు. ఈ మధ్యకాలంలో కొబ్బరితో పాటు ఆయిల్ పామ్, మామిడి, పనస, అరటి, సీతాఫలం వంటి పండ్ల తోటలను అలాగే అనేక అలంకార జాతుల పూల మొక్కలను ఆశిస్తూ తీవ్రమైన నష్టం కలిగిస్తున్న అన్యదేశపు కీటకమైన రూగస్ సర్పిలాకారా తెల్లదోమ నియంత్రణకు రైతులందరూ సామూహికంగా సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా దీనిని నివారించవచ్చని డాక్టర్ రాజశేఖర్ చెబుతున్నారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

ప్రజాశక్తి- టెక్కలి

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో 9 మంది విద్యార్థులు బాలికోన్నత పాఠశాలలో ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. అదేవిధంగా స్థానిక ఆర్‌సిఎం, ఇన్‌ఫెంట్, బాలికోన్నత పాఠశాలల్లో నిర్వహించిన ఓపెన్ ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల్లో పంతొమ్మిది మంది విద్యార్థులు హాజరయ్యారు. సప్లిమెంటరీ పరీక్షలను టెక్కలి డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి పి.విలియమ్స్, లావేరు, టెక్కలి మండల విద్యాశాఖాధికారులు మురళీకృష్ణ, దాసుపురం చిన్నారావులు పర్యవేక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఉద్యానవనంగా మార్చేందుకు చర్యలు

ప్రభుత్వ విప్ అశోక్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఉద్దానాన్ని ఉద్యానవనంగా మార్చేందుకు తన వంతు చర్యలు తీసుకుంటానని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. ఇచ్ఛాపురం పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన డయాలిసిస్ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో మూడు కేంద్రాల్లో డయాలిసిస్ కేంద్రాలు ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం కిడ్నీ బాధితులను అన్ని విధాలా ఆదుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ వ్యాధి తీవ్రత జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తెరపై తెచ్చి అప్పటి సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకొచ్చారని గుర్తుచేశారు. చంద్రబాబు కిడ్నీ వ్యాధిగ్రస్తులకు పింఛను, ఉచితంగా మందులు, రూ.2కే శుద్ధ జలాలు అందించామన్నారు. అలాగే పలాసలో కిడ్నీ రీచర్చ్ కేంద్రం మంజూరుకు చంద్రబాబు చేశారన్నారు. త్వరలో శాశ్వత పరిష్కారానికి చొరవ చూపుతామన్నారు. డిసిహెచ్ ఎన్.కళ్యాణబాబు మాట్లాడుతూ డయాలసిస్ కేంద్రాలు రావడానికి సిఎం చంద్రబాబు చొరవ ఉందన్నారు. సమావేశంలో కమ్యూనిటీ ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి పి.దేవేంద్రరెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, మంగి లక్ష్మి, టిడిపి నాయకులు కాళ్ల ధర్మారావు, నందికజాని, లీలారాణి, నందిగాం కోటి, కాళ్ల దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న విప్ అశోక్

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార కార్యక్రమంలో వచ్చే ప్రజా ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇస్తూ జాప్యం లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులకు ఆదేశించారు. చట్ట పరిధిలో చర్యలు చేపట్టి బాధితులకు న్యాయం చేయాలన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్‌పి ప్రజల నుంచి 50 వినతులు స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా తెలియజేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని ఆదేశించారు.

మెగా సమ్మర్ సెలబ్రేషన్ ప్రకటించిన టొయోటా

ప్రజాశక్తి- శ్రీకాకుళం

'మెగా సమ్మర్ సెలబ్రేషన్' ను టొయోటా ప్రారంభించింది. పెదపాడు టయోటా షోరూంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో టొయోటా కిర్లోస్కర్ మోటార్ సేల్స్ సర్వీస్ యూజ్డ్ కార్ సేల్ రీజియన్ చీఫ్ రిప్రజెంటేటివ్ వైస్‌లైన్ సిగామణి మాట్లాడుతూ ఇది దక్షిణ భారతదేశంలోని అధీకృత టొయోటా డీలర్‌షిప్‌లో అందుబాటులో ఉంటుందని చెప్పారు. కొత్తకారు కొనడం, ఉన్న కార్లకు సర్వీసింగ్ చేయడం, సర్టిఫైడ్ యూజ్డ్ కార్లను గుర్తించడం లేదా వాహన ఉపకరణాలను అప్‌గ్రేడ్ చేయడం, ఆకర్షణీయమైన డీల్స్ పొందటం దీంతో సాధ్యమవుతుందన్నారు. మెగా సమ్మర్ సెలబ్రేషన్‌లో భాగంగా తమ 'కస్టమర్ ఫస్ట్' సిద్ధాంతానికి కట్టుబడి, వేసవి సెలవుల్లో కొత్త టొయోటా కార్లు, టొయోటా కార్ సర్వీస్, ఉపయోగించిన కార్ల కొనుగోలుపై కస్టమర్‌లకు విలువను అందించడం ఈ ప్రచారం లక్ష్యమన్నారు. ఈ మెగా సమ్మర్ సెలబ్రేషన్ ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణలో టయోటా డీలర్‌షిప్‌లలో అందుబాటులో ఉంటున్నారు. టొయోటా కిర్లోస్కర్ మోటార్‌లో అసాధారణమైన వాహనాలను అందించడంపై మాత్రమే కాకుండా ప్రతి కస్టమర్ టచ్ పాయింట్‌ను సౌలభ్యం, సంరక్షణ పెంచడానికి కట్టుబడి ఉండటం లక్ష్యమన్నారు. 'మెగా సమ్మర్ సెలబ్రేషన్'తో, టొయోటా కస్టమర్ల అనుభవానికి మరింత విలువను తీసుకురావాలని, ఈ వేడుకలో భాగంగా, తాము ఉచిత కార్ హెల్త్ చెకప్‌ను కూడా అందిస్తున్నామన్నారు. తద్వారా కస్టమర్లు నష్టకారం, ఉత్సాహంగా మనశ్శాంతితో ఈ వేసవిలో డ్రైవ్ చేయవచ్చును అని చెప్పారు.

విద్యార్థులను అభినందిస్తున్న సభ్యులు

రక్తదాన శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని పూండి కేంద్రంగా సేవలు అందిస్తున్న యువతరం సేవా సమితి ఆధ్వర్యాన పలాస ప్రాణదాత బ్లడ్ బ్యాంకు సౌజన్యంలో పెద్దమురహరిపురంలో సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. 21 మంది రక్తదాతలు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదాతలకు నిర్వాహకులు ప్రశంసాపత్రాలను, జ్ఞాపికలను అందజేశారు. ఇందులో భాగగా ప్రతిభకు ప్రోత్సాహం పేరుతో పలాస, టెక్కలి నియోజకవర్గాల పరిధిలో ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల నుంచి మండల స్థాయిలో ప్రథములుగా నిలిచిన విద్యార్థులకు, ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాల నుంచి ఎంపిసి విభాగంలో 984 మార్కులతో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిన కర్ని ధరణిలకు సేవా సమితి తరుపున ఒక్కొక్క విద్యార్థికి రూ.2 వేలు నగదు, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు చింత మురళి, మాజీ ఎంపిపి గోరకల వసంతరావు, మదానాల జోగారావు, సునీల్, కెంగువ రాంబాబు, కర్ని నారాయణరావు పాల్గొన్నారు.

ఎఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యునిగా 'యుగంధర్'

శ్రీకాకుళం: అఖిలభారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) జాతీయ కార్యవర్గ సభ్యునిగా జిల్లాకు చెందిన మొజ్జాడ యుగంధర్ నియమితులయ్యారు. తిరుపతిలో ఈ నెల 15 నుంచి 18 వరకు జరిగిన ఎఐవైఎఫ్ జాతీయ మహాసభల్లో యుగంధర్‌ను ఎన్నుకున్నారు. కమ్యూనిస్టు భావజాలంతో విద్యార్థి దశ నుంచే విద్యార్థుల హక్కులకోసం పోరాడి విద్యార్థి సంఘాల్లో కీలకంగా వ్యవహరించిన యుగంధర్ అనంతరం యువజన సమైక్యలో కీలకంగా వ్యవహరించారు. గత ఫిబ్రవరిలో శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్ర మహాసభల నుంచి రాష్ట్ర అధ్యక్షునిగా యుగంధర్ కొనసాగుతున్నారు. ఇప్పుడు జాతీయకార్యవర్గంలో తొలిసారిగా శ్రీకాకుళం వాసికి అవకాశం దక్కింది. యుగంధర్ నియామకంపై పలువురు జిల్లా యువజన, విద్యార్థి, కమ్యూనిస్టు నాయకులు హర్షం వ్యక్తం చేసి యుగంధర్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా యుగంధర్ మాట్లాడుతూ తనపై మరింత బాధ్యత పెరిగిందని, యువజన సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈయన ఎన్నికపై ఎఐవైఎఫ్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.సంతోష్, కె.శ్రీనివాస్, జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు

శ్రీకాకుళం: స్థానిక జిల్లా గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణా శిబిరంలో సంఘ సేవకులు సోడవరం ఈశ్వరరావు ఆధ్వర్యంలో చిత్రలేఖనంలో మెలకువలు, కబడ్డీ ఆటలు ఆడించారు. ప్రముఖ దాసు రచయిత, గాయకులు సతీష్ యాదవ్ పాల్గొని పిల్లలకు అమ్మ ప్రేమను తెలియ జెప్పే సతీష్ యాదవ్ స్వరపర్చిన పాటను అయన నేర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సెక్రెటరీ బి.కుమార రాజ్, ఉప గ్రంథ పాలకులు శంకరరావు, లోకేష్ సాయి, తనుశ్రీ, యువరాజ్, నీలిమ, లీలాకృష్ణ, ధీక్షిత, జానేశ్వర్, ఆదిత్య, నైనిక, కోమలి, జిల్లా గ్రంథాలయ సిబ్బంది మోహన్, వరలక్ష్మి, సిహెచ్ శివ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

లావేరు: విద్యార్థులు తెలుగు భాషపై పట్టు సాధించాలని రిసోర్స్ పర్సన్ ఎం.శంకరరావు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో తెలుగు భాష, తెలుగు వ్యాకరణం కోసం విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, సహాయకుడు వీరభద్రుడు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

కొవ్వొత్తులను ప్రదర్శిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

పొందూరు: అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి ఐసిటిసి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో ప్రదర్శనను నిర్వహించారు. ఎయిడ్స్, హెచ్ఐవి మహమ్మారి బారిన పడి మృతి చెందిన వారి ఆత్మకు శాంతికి నివాళిగా ఈ కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.పి.సుజాత, వైద్యులు శ్రీదేవి, ఐసిటిసి కౌన్సిలర్ కె.నాగావళి, ల్యాబ్ టెక్నిషియన్ విజయలక్ష్మి, ఆస్పత్రి సిబ్బంది, ఎన్‌జిఒ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రసాయనాలు వద్దు... కషాయాలే ముద్దు

ప్రజాశక్తి- మందస

గ్రామీణ ప్రాంతంలో ప్రకృతి వ్యవసాయం ప్రగతికి రైతులందరూ పూర్తి అవగాహన పొంది, పొలంలో అతిగా రసాయనాలు వాడొద్దని, పంటల బాగుకు సేంద్రీయ కషాయాలే ముద్దు అని వెలుగు ఐటిడిఎ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మండలంలోని చిన్నబరంపురంలో సర్పంచ్ ప్రతినిధి లక్ష్మణరావు, గ్రామ పెద్దలు మెట్ట మహేష్ ఆధ్వర్యాన ప్రకృతి వ్యవసాయపై సోమవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రసాయనాలు వద్దు కషాయాలే ముద్దు అని, నేలతల్లి ఆరోగ్యానికి నవధాన్యాల సాగు మంచిదని అన్నారు. ప్రధాన పంటతో పాటు ఈ నవధాన్యాల మొక్కలు పొలంలో పుట్టడం వల్ల పైరుకు మేలు చేసే సూక్ష్మజీవులు వాటి వేళ్ల ద్వారా నేల గుళ్ల బారి వాన పాములు లాంటి మిత్ర పురుగులు అభివృద్ధి చెందుతాయని వివరించారు. కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షులు మెట్ట శారద, క్లస్టర్ కో-ఆర్డినేటర్ స్వామినాయుడు, విఒఎ నాగమణి, అగ్రికల్చర్ ఆఫీసర్ నాగరాజు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని కరజాడ గ్రామపంచాయతీ పరిధి సచివాలయంలో ప్రకృతి వ్యవసాయంపై సర్పంచ్ బమ్మిడి పున్నయ్య, బిజెపి మండల అధ్యక్షులు నెమలిపురి రవికుమార్ ఆధ్వర్యాన అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ ధరన్, ఐసిఆర్‌పిలు ఊహ, సంధ్యారాణి, హరిత, రజని, వైస్ ప్రెసిడెంట్ కొల్లి ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: ఎచ్చెర్ల యూనిట్ ఎస్ఎస్ఆర్ పురంలో డిపిఎం పూజారి సత్యనారాయణ ఆదేశాల మేరకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనిట్ ఇన్‌ఛార్జి సోవారి సన్యాసిరావు మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి వ్యవసాయ పంటలు సాగు విధానం, నవధాన్యాల సాగు పద్ధతుల కార్యాచరణ ప్రణాళికతో ప్రకృతి వ్యవసాయ ప్రాముఖ్యతను వివరిస్తూ రైతులతో ర్యాలీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సత్యవతి, సర్పంచ్ దుంప చెన్నారెడ్డి, ఎంపిటిసి గాలి రామారావు, మెట్ట ధనుంజయరావు, సీపాన హరేరామ్, పైడి తులసి తదితరులున్నారు. అనంతరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు కొల్లి రామారావును సన్మానించారు.

మందస : అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

నిధుల వినియోగంపై ఆడిట్

టెక్కలి: రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలలకు 2024-25లో మంజూరైన నిధులు వినియోగంపై సోమవారం మహాత్మాజ్యోతీభా పూలే బాలికల గురుకుల పాఠశాలలో ఆడిట్ నిర్వహించారు. ఎంఇఒ దల్లి తులసీరావురెడ్డి అధ్యక్షతన హైదరాబాద్ నుంచి బృందం టెక్కలి వచ్చి ఆడిట్ నిర్వహణ చేపట్టారు. ఇందుకు సంబంధించి టెక్కలి డివిజన్ పరిధిలోని 13 మండలాల పరిధిలో పలు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు వచ్చి ఆడిట్ నిర్వహణ చేయించుకున్నారు.

దాతృత్వం చాటుకున్న ప్రొఫెసర్

శ్రీకాకుళం: స్థానిక రెల్లవీధిలో నివాసముంటున్న ఎలుగు మహంతి స్వాతి కుమార్తె అనుష చదువు నిమిత్తం రూ.5వేలు నగదును ప్రభాకర్ నగర్ కాలనీకి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ అరికతోట కనకరాజు, ఉమా సోమవారం అనూష తాతయ్య కరకవలస భువనేశ్వరరావుకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనూష 10వ తరగతి, ఇంటర్, ఇఎపి సెట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిందని, ప్రస్తుతం టెక్కలి ఐతం ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ రెండవ సంవత్సరం చదువుతుందని, ఆమె కుటుంబం ఆర్థికంగా వెనకబడి ఉండటంతో ఆమె తాతయ్యపై ఆధారపడి ఉందన్నారు. బ్యాంకుల నుంచి విద్యారుణం కోసం ప్రయత్ని స్తోందని, ఆమె చదువు కొనసాగించడానికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహాయం అందించాలని కోరారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

పలాస: క్రీడాకారుల్లో పోటీతత్వం ఉండాలని వైసిపి పట్టణ అధ్యక్షుడు శిష్టు గోపి అన్నారు. కాశీబుగ్గ సూదికొండ ప్రాంతంలో సోమవారం క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆడుతున్న క్రీడాకారులంతా ఒకప్పుడు గ్రామస్థాయి నుంచే వెళ్లిన వారేనని అన్నారు. క్రీడాకారులు నిత్యం సాధన చేయాలన్నారు. క్రీడలు నిర్వహించడం ద్వారా గ్రామాలు, క్రీడాకారులు మధ్య స్నేహ సంబంధాలు మెరుగుపడతాయన్నారు. అనంతరం వార్డు పరిధిలో కొన్ని టీమ్‌లుగా ఏర్పడి టోర్నమెంట్ నిర్వహి స్తున్నారు. యువకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

స్నేహితునికి ఆర్థికసాయం

ఇచ్ఛాపురం: మండలంలోని ఈదుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న బాల్యమిత్రుడు తిప్పనపుట్టుగకు కొన్నాయి గిరిధర్ ఇటీవల అనారోగ్యానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న తోటి బాల్యమిత్రులు రూ.35 వేలు వసూలు చేసి గిరిధర్‌కు సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. గిరిధర్‌కు ఇంకా దాతలు సాయం చేస్తే అతని ఆరోగ్యం కుదుటపడుతుందని అన్నారు.

విద్యార్థులకు అభినందన

విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం: కొలువులకు సరైన వేదిక కాకినాడ ఆదిత్య కళాశాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. 80 అడుగుల రోడ్డు కూడలి వద్ద గల కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో ప్రముఖ కంపెనీల్లో ఎక్కువ ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే శంకర్ అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీకాకుళంలో ఇంత మంచి వార్షిక వేతనాలతో డిగ్రీతో ఉద్యోగాలను సాధించడం గొప్ప విషయమని, ప్రస్తుతం ఉద్యోగాలు సాధించడం చాలా కష్టంగా ఉన్న తరుణంలో, ప్రతి విద్యార్థి రెండు లేదా అంతకంటే ఎక్కువ ఉద్యోగాలు సాధించడం అభినందించాల్సిన విషయమన్నారు. విద్యార్థినులను క్రమశిక్షణతో పాటు, కొలువులకు ఎలా సిద్ధమవ్వాలో డిగ్రీ మొదటి సంవత్సరం నుంచే అన్ని రకాలుగా శిక్షణను అందజేస్తున్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల యాజమాన్యానికి ప్రత్యేక అభినందనలని, వారి కృషి ఫలితమే ఇన్ని కొలువులు సాధ్యమైయ్యాయన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ బిఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

తుపానుపై అప్రమత్తం

బూర్జ : సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ ప్రవల్లిక

శ్రీకాకుళం: ఈనెల 19, 20, 21, 22, 23 తేదీల్లో అక్కడక్కడ 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలలు, ఉరుములు ఉండే అవకాముందని 22, 23, 24 తేదీల్లో భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించిందని జి.సిగడాం మండల తహశీల్దార్ ఎం.సరిత సూచించారు. మండలంలో మోస్తరు నుంచి తెలికపాటి వర్షాలు పడే వీలుందన్నారు. తుపాను ఉన్నంతవరకు మండలంలో ప్రభుత్వ ఉద్యోగులు అన్ని శాఖల వారికి సెలవులు ఇచ్చేదే లేదన్నారు. మండల అధికారులు, సచివాలయ సిబ్బంది కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం అధికారులతో కలిసి మండల కేంద్రంలో ఉన్న ప్రజల వద్దకు వెళ్లి తుపాను, పిడుగులపై అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు చేశారు. ఎపిఎం రెడ్డి రామకృష్ణ నాయుడు, ఎపిఒ సత్యనారాయణ, మండల పరిషత్ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బూర్జ: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఎంపిడిఒ తిరుపతిరావు మండలస్థాయి అధికారులతో విపత్తు నిర్వహణ కార్యక్రమం నిర్వహించారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వచ్చినప్పుడు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సచివాల సిబ్బంది, కార్యదర్శులతో పాటు అధికారులు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని వివరించారు. సమావేశంలో ఎస్ఐ ప్రవల్లిక, విజయలక్ష్మి, విద్యుత్‌శాఖ ఎఇ, వైద్యశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- రణస్థలం

నేత్రాలకు సంబంధించి తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని కళ్యాణి కంటి ఆస్పత్రి పారామెడికల్ అప్తాలమిక్ ఆఫీసర్ ఎస్.కళ్యాణి అన్నారు. మండల కేంద్రంలోని కళ్యాణి కంటి ఆస్పత్రి ఆవరణలో సోమవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 65 మంది హాజరయ్యారు. వైద్య పరీక్షలు నిర్వహించి 11 మందిని శస్త్రచికిత్సల కోసం ఎంపిక చేసి శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ ఇంద్రియాలు అన్నింటిలో కన్ను ప్రధానమైనదని, కళ్లను సంరక్షించుకోవడం మన బాధ్యతన్నారు. కంటిచూపు మసకబారటం, కంటి నొప్పి, కళ్లముందు మిరుమిట్లు గొలిపే కాంతులు మెరవడం వంటి లక్షణాలు కనిపిస్తే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు.

రణస్థలం : రోగులను శస్త్రచికిత్సల కోసం బస్సులో తరలిస్తున్న సిబ్బంది

పొందూరు: మండలంలోని తోలాపిలో సత్యసాయిబాబా ఆలయంలో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసర గ్రామాలకు చెందిన 40 మందికి నేత్ర పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ సిబ్బంది, సత్యసాయి మందిర సేవాదళ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు చర్యలు

మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

పలాస: ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు నుంచి పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఇంటింటికీ తాగునీరు సరఫరాకు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రభుత్వం కేటాయించిన 5 ఎంఎల్‌డి తాగునీటిని జంట పట్టణాల్లో అన్ని వార్డులకు, అన్ని వీధుల్లో సరఫరా చేసేవిధంగా ప్రణాళికను రూపొందించేందుకు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాటాడుతూ గౌతు శిరీష, చైర్మన్ బల్ల గిరిబాబు ఆదేశాలతో జంట పట్టణాల్లో అన్ని వార్డులకు తాగునీటి పైపులైన్లను ఇంటింటికీ కుళాయి ద్వారా నీటిని ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో ఎఇలు కిరణ్‌కుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

పాడి రైతులు అప్రమత్తం

పాతపట్నం : ఉరుములు, మెరుపులు, పిడుగులు వచ్చేటప్పుడు గొర్రెల, మేకల పెంపకందారులు, పశు పెంపకం దారులు జాగ్రత్తగా ఉండాలని స్థానిక పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు సూచించారు. ఎంపిడిఒ కార్యాలయంలో తహశీల్దార్ కిరణ్‌కుమార్ అధ్యక్షతన సోమవారం పశు వైద్య సిబ్బంది, గొర్రెల, మేకల పెంపకందారులతో సమావేశం నిర్వహించారు. ఉరుములు, పిడుగులు వచ్చేటప్పుడు ఎత్తయిన ప్రదేశాల్లో, ఆరు బయట ప్రాంతాల్లో ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ చంద్రకుమారి, ఎస్ఐ లావణ్య, పశువైద్యాధికారులు అనిల్, శ్రీవాణి, మౌనిక పాల్గొన్నారు.

పోలాకి : ఉరుములు, మెరుపులపై గొర్రెలు, మేకలు పెంపకందారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్య అధికారి అనిల్‌కుమార్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పాడి రైతులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.రవికుమార్, డిటి రాజారెడ్డి, ఇఒపిఆర్‌డి పద్మావతి పాల్గొన్నారు.

నందిగాం : ఉరుములు, పిడుగులపై గొర్రెలు, మేకలు పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధకశాఖ ఎడి ఎం.రవికృష్ణ అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో అవగాహన కల్పించారు. తహశీల్దార్ సోమేశ్వరరావు, ఎంపిడిఒ కుమార్ పట్నాయక్, ఇఒపిఆర్‌డి రాజారావు, పశువైద్యాధికారి బి.మన్మథరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: సన్నజీవాల కాపరులకు పిడుగులు, ఉరుముల వంటి విపత్కర పరిస్థితిలు వచ్చినప్పుడు ఎలా బయటపడాలో తెలుసుకోవాలి ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, తహశీల్దార్ ఎస్.అప్పలరాజు, పశు వైద్యాధికారి ఎల్.కిరణ్‌కుమార్‌లు అన్నారు. గొర్రెలు, మేకలు పెంపకందారులు, రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గొర్రెల పెంపకందారులు బొడ్డు రమణ, కొర్రాయి అప్పన్న, వంజరాపు ప్రసాద్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వేషధారణలు

వజ్రపుకొత్తూరు: మండలంలోని చినడోకులపాడులో ఉన్న అంబికాదేవి సంబర మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం వివిధ వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. అండమాన్ వారిచే కాళీ-జాలారీ వేషం, తాడేపల్లి వారిచే దశావతారాలు, గంగాధరపల్లి బాలికల కోలాట ప్రదర్శన, స్థానిక చిన డోకులపాడు చిన్నారుచే కోయి డాన్స్, లుంగీ డ్యాన్స్‌లు విశేషంగా ఆకట్టుకున్నాయి. అంతకుముందు ఉదయం పెద్ద అమ్మవారికి సింహద్వారం వద్ద పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలకు విచ్చేసిన యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

క్వారీల పరిశీలన

కొత్తూరు: మండలంలోని మదనాపురం దిమిలి, రోడ్ మేటల్ అండ్ బిల్డింగ్ స్టోన్ మెటీరియల్ క్వారీలను తహశీల్దార కె.బాలకృష్ణ, ఎస్ఐ మహమ్మద్ అమీర్ ఆలీ సోమవారం పరిశీలించారు. క్వారీలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. నిబంధన అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీరితో విఆర్‌ఒలు శ్రీను, లోకేష్, హరీష్ ఉన్నారు.

లైగింక వేధింపులు నేరం

టెక్కలి : వివిధ రకాల పనిప్రదేశాల్లో లైగింక వేధింపులు చట్టరీత్యా నేరమని టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి బి.నిర్మల అన్నారు. స్థానిక కోర్టు సముదాయాల్లో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం, ప్రయివేట్ సంస్థల ప్రాంగణంలో లైగింక వేధింపులకు పాల్పడితే సంబంధిత యజమానికి ఫిర్యాదు చేయాలన్నారు. ఇందుకు సంబంధించిన చట్టాలపై అవగాహన ఏర్పాటు చేసుకుని వాటిని వివరించా లన్నారు. సమావేశంలో ప్యానల్ న్యాయ వాదులు మెట్ట గోవింద్, పి.మధుబాబు, ఎల్.బాలకృష్ణ, కొత్తూరు గోపాలకృష్ణ, తనయ, రాజేష్ పాల్గొన్నారు.

ముట్టడిని విజయవంతం చేయాలి

టెక్కలి: ఉపాధ్యాయ సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఐక్య వేదిక ఆధ్వర్యాన ఈ నెల 21న చేపట్టిన డిఇఒ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని మండల ఐక్య వేదిక నాయకులు తమ్మినేని వైకుంఠరావు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. బదిలీలు, ఉద్యోగోన్నతుల కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జిఒలను రద్దు చేయాలన్నారు. పేద విద్యార్థులకు న్యాయమైన విద్య, భావితరాల్లో మాతృభాషా బోధన చేయాలన్నారు. ప్రభుత్వ బడులు పరిరక్షనకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రకటన విడుదల చేసిన వారిలో ఐక్య వేదిక నాయకులు పడాల గణపతి రావు, బమఅన్మిడి కృష్ణారావు, ఆనందరావు, చిన్నా రావు, బాబూరావు, గుంట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గైర్హాజరైతే చర్యలు

టెక్కలి: టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారమూ నిర్వహించే ప్రజా ఫిర్యాదుల విభాగాన్ని గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకుంటామని టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి అన్నారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల విభాగానికి గైర్హాజరైన అధికారులు ఎవరు అనే దానిపై హాజరు పట్టి పరిశీలించి వారిని గుర్తించి వారికి మెమోలు జారీ చేయాలన్నారు. ఈ మేరకు 15 వినతులు అందాయి.

కార్మికుల నివాళి

ఎచ్చెర్ల: శ్యాం పిస్టన్ ఫౌండర్ దాలి మృత్యంజయరావు ద్వితీయ వర్ధంతి సందర్భంగా ప్లాంట్-3 వద్ద యాజమాన్యం ఏర్పాటు చేసిన వర్ధంతి సభలో స్టాఫ్ అండ్ వర్కర్స్ యునియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వి.రమణ, వై.ఆదినారాయణలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పి ంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్యాంపిస్టన్ ఫౌండర్‌గా జిల్లాలో ప్లాంట్‌లు ఏర్పాటు చేసి జిల్లా అభివృద్ధికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో పి.శ్రీనుబాబు, ఎం. గౌరీశంకర్, పి.దుర్గాప్రసాద్, ఎం. సూర్య నారాయణ, జి.నాగభూషణ, పి.శ్రీను, కె.సంతోష్, ఎస్. దుర్గారావు, ఎన్.రమణ పాల్గొన్నారు.

'తాతయ్య' బాధ్యతల స్వీకరణ

శ్రీకాకుళం: జిల్లాలోని గొర్రెలు, మేకల పెంపకం దారుల సహకార సంఘం అధ్యక్షునిగా కుజ్జు తాతయ్య బాధ్యతలు స్వీకరించారు. సోమవారం నగరంలోని పశుసంవర్ధక శాఖ జిల్లా కార్యాలయంలో ఆయనతో పాటు తొమ్మిదిమంది డైరక్టర్లు బాధ్యతలు చేపట్టారు. వారిని జాయింట్ డైరక్టర్ డా. కె.రాజ గోపాల్, ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ డా.బమ్మిడి నాగేశ్వర రావు, ఐఎస్‌డిపి సిబ్బంది, టిడిపి బిసిసెల్ అధ్యక్షులు కలగ జగదీష్‌లు అభినందించారు.

ప్రశాంతంగా ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష

టెక్కలి రూరల్: ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరేందుకు జెఎన్‌టియు ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఎపి ఈసెట్ ప్రవేశ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభ మయ్యాయి. స్థానిక ఆదిత్యా ఇంజినీరింగ్ కళాశాలలో ప్రారంభమైన ఈ ప్రవేశ పరీక్ష మొదటి రోజు వ్యవసాయ ఇంజినీరింగ్ కోసం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఇందుకు సంబంధించి 230 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు నిర్ణీత సమయానికే పాల్గొన్నారు.

నిరుపేదకు ఆర్థికసాయం

రణస్థలం: మండలంలోని కోటపాలేం పంచాయతీ ఎస్‌సి కాలనీకి చెందిన పేద కుటుంబానికి చెందిన కేత నీలవేణి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న జనసేన యువ నాయకులు గొర్లె సూర్య ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఆర్థికసాయం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆమె కుటుంబానికి ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

ప్రజాశక్తి- పొందూరు

యువంత్ (ఫైల్)

పొందూరు - చిలకపాలెం రహదారిలోని ఎరుకులపేట వద్ద ద్విచక్ర వాహనం ఢీకొని సోమవారం మండలంలోని గోకర్ణపల్లి పంచాయతీ రంగనాథపేటకు చెందిన పేడాడ వెంకటసూర్య యువంత్ (6) అనే బాలుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే... ఎరుకులపేటలో గల చిన్నతాతయ్యను చూసేందుకు తల్లిదండ్రులతో కలిసి వచ్చాడు. అనంతరం చిలకపాలెం వెళ్లేందుకు ఎరుకులపేట బస్టాప్ నుంచి రహదారి అవతలవైపు ఆటో ఆపేందుకు తండ్రి హరిబాబు వెళ్లాడు. ఇంతలో తండ్రి దగ్గరకు వెళ్లాలనే ఆత్రుతతో తల్లి ఈశ్వరమ్మ చేతిని బాలుడు విదుల్చుకుని పరిగెత్తాడు. అదే సమయంలో చిలకపాలెం నుంచి పొందూరు వైపు వస్తున్న ద్విచక్రవాహనం బాలుడుని బలంగా ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన బాలుడుని పొందూరులో ప్రైయివేటు ఆస్పత్రికి తీసుకువెళ్లగా అక్కడ డాక్టర్ లేకపోవడంతో 108 వాహనంలో శ్రీకాకుళం ప్రైయివేటు ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమించందని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తీసుకువెళ్లాలని సూచించారు. ఆస్పత్రికి తీసుకు వెళ్తుండగా మర్గమధ్యంలోనే మృతి చెందాడు. మృతుడు తండ్రి హరిబాబు విశాఖపట్నంలోని ప్రవేటు కాలేజీలో పనిచేస్తున్నారు. బాలుడు తండ్రి హరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్న ట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. సెలవులకు వచ్చి సర దాగా చిన్నతాతయ్య ఇంటికి వెళ్లి బాలుడు మృత్యువాత పడ డంతో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలముకున్నాయి.

తాపీమేస్త్రి దుర్మరణం

ఎచ్చెర్ల: మండల పరిధిలో కొంగరాంకు చెందిన సూర శ్రీనివాసరావు (39) అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఎస్ఐ వి.సందీప్ కుమార్ వివరాల మేరకు శ్రీనివాసరావు మృతదేహాన్ని సోమవారం ఉదయం పొన్నాడ బ్రిడ్జి రోడ్‌లో మెకానిక్ షెడ్ సమీపంలో పొలాల్లో గుర్తించామన్నారు. మద్యం అలవాటు ఉన్న శ్రీనువాసరావు ఆదివారం రాత్రి మృతి చెంది ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. శ్రీనివాసరావుకు గార మండలం అయ్యవారిపేటకు చెందిన హైమావతితో వివాహం జరిగింది. ఈయనకు సౌజన్య, హారిక ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మద్యం అలవాటు ఉన్న శ్రీను నిత్యం మద్యం సేవించి భార్యతో గొడవ పడుతుండగా ఆమె రెండు నెలల క్రితం తన కన్నవారి ఇంటికి వెళ్లిపోగా శ్రీనివాసరావు ఒక్కడే ఇంటి దగ్గర ఉంటున్నాడు. దీంతో ఆయన అతిగా మద్యం సేవిస్తూ ఆదివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పొలాల్లో మృతదేహం వద్ద క్లూస్ టీం చేరుకొని ఆదారాలు సేకరించి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం ఆదారంగా దర్యాప్తు చేస్తామని ఎస్ఐ సందీప్ తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

వెంకటి (ఫైల్)

సరుబుజ్జిలి: మండలంలోని కూన జమ్మన్న పేటకు చెందిన హనుమంతు వెంకటి (60) రోజు కూలి అనుమానస్పదంగా మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఎప్పటిలాగానే ఆదివారం రోజువారీ కూలీ పనికి వెళ్లి సాయ ంత్రం అయినప్పటికీ ఇంటికి తిరిగి రాలేదన్నారు. రాత్రి సుమారు 8 గంటల సమయంలో సరుబుజ్జిలికి చెందిన ఒక వ్యక్తి తమకు సమాచారం ఇస్తూ సరుబుజ్జిలి కూన జమ్మన్నపేట గ్రామాల మధ్య వెంకటి రోడ్డు పక్కన పడి ఉన్నట్లు తెలియజేయగా వెంటనే అక్కడకు చేరుకొని 108 వాహనంలో శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు ఆస్పత్రి సిబ్బంది తెలిపారన్నారు. ఏదో ప్రమాదవశాత్తు తన భర్త ప్రాణాలు కోల్పోయి రోడ్డుపక్కన పడి ఉన్నారనే అనుమానంతో భార్య నారాయణమ్మ సరుబుజ్జిలి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి రిమ్స్ ఆస్పత్రిలో పోస్టు మార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మేడపై నుంచి జారిపడి కారు డ్రైవర్ మృతి

ఈశ్వరరావు (ఫైల్)

రణస్థలం: జె.ఆర్.పురం పోలీసు స్టేషన్ పరిధిలోని కొండ‌ములగాంకు చెందిన బి.ఈశ్వరరావు మేడపై నుంచి జారి పడి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే... ఈనెల 15న రాత్రి 10 గంటలకు తన ఇంటి మేడపై నిద్రిస్తున్న సమయంలో మేడచుట్టూ పిట్టగోడ లేక పోవడంతో నిద్రలో మేడపై నుంచి కిందకు పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన ఈశ్వరరావును విశాఖ పట్నం కెజిహెచ్‌కు తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి ఒంటిగంట దాటిన తరువాత మృతి చెందాడు. మృతుడు భార్య మంగమ్మ సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ ఎస్. చిరంజీవి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాముకాటుకు మహిళ మృతి

ఎచ్చెర్ల : ఎచ్చెర్లకు చెందిన నేతింటి రాజులమ్మ (55) పాము కాటుకు గురై మృతి చెందింది. ఆమె భర్త అప్పలసూరితో కలిసి పొలంలో గడ్డి కోసేందుకు సోమవారం వెళ్లింది. ఈ సమయంలో పాముకాటుకు గురైంది. గమనించిన ఆమె భర్త అప్పలసూరి రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. ఈమెకు నలుగురు కుమారులు ఉన్నారు. అందులో నేతింటి రాజారావు టిడిపి నాయకులు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

గుర్తు తెలియని మృతదేహం

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి తాళభద్ర రైల్వేగేట్ సమీపంలో సోమ వారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసు కున్న కాశీబుగ్గ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభు త్వాస్పత్రికి తరలించారు. మృతుని వివరాలు తెలియాల్సి ఉంది. కాశీబుగ్గ సిఐ సూర్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొబ్బరి చెట్లపై పిడుగు

దగ్ధమవుతున్న కొబ్బరి చెట్టు

వజ్రపుకొత్తూరు: మండలంలోని సోమవారం వేకువజామున మెరుపులు, గర్జనలకు కొమ రల్తాడ పంచాయతీ తామాడ పేటలో కొబ్బరి చెట్లపై పిడుగు పడింది. అదే గ్రామానికి చెందిన చింత మహేష్ రెండు కొబ్బరి చెట్లు కాలిపోయాయి. అదే విధంగా పిడుగు ధాటికి ఇంట్లోని గృహోకరణాలు ధ్వంస మయ్యాయి. అలాగే సమీపంలోని సుంకర జగన్నాథపురం సర్పంచ్ ప్రతినిధి అఖిల్‌నకు చెందిన పెన్సింగ్ ఫ్యాక్టరీలోని మిషనరీ దెబ్బతిందని బాధితులు తెలిపారు.